కథా నిలయం
3519
శ్రీకాకుళం

# చిరిగిన తెరలు

సముద్రం కనుచూపు మేరంతా విశాలంగా కదులుతూంది. ఒడ్డు దాటాలని కాబోలు ముందుకి వెనక్కి విరామం లేకుండా ప్రయత్నిస్తున్నది. అది ఎన్నాళ్ళప్రయత్నమో? అలసి, అలసి కెరటాలు నురగలు కక్కుతున్నాయి! పెద్ద కెరటం ఒకటివచ్చి కట్ట దాటలేక విరిగి, తిరిగి వెళ్ళిపోయేముందు పెద్ద నిట్టూర్పు విడిచినట్టుగా హోరుమంటూంది

ఒడ్డున బండరాళ్ళు కెరటాలు వచ్చినప్పుడల్లా రొమ్మిచ్చి ఎదుర్కొంటున్నాయి నిబ్బరంగా. కెరటాలు వెనక్కి వెళ్ళినప్పుడు ఇసుకలో నుండి పైకివస్తున్న పీతల్ని ఏరుకు తినడానికి కాకులు ఎగురుతున్నాయి, వెనకనుండి మళ్ళీ వస్తున్న బ్రహ్మాండమయిన కెరటాలను ఆ ఒక్క కంటా కనిపెడుతూనే.

కెరటాలు వస్తున్నాయి; రాళ్ళకేసి తలలు బద్దలుకొట్టుకొని వెళ్ళిపోతున్నాయి. వాటితో వచ్చిన పీతలూ, పురుగులూ, గుల్లలూ గబ గబా ఇసుకలోకి పోయి దాక్కుంటున్నాయి... దొరికినవాటిని కాకులు పుచ్చుకుంటున్నాయి... ఎంత చూసినా ఇంతే. ఎన్నిసార్లు జరిగినా ఇదే ... సముద్రపుటొడ్డులో ఇంకే కొత్తా లేదుగాని, మనసూ, హృదయమూ ఏదో కొత్త పరవళ్ళు తొక్కుతూవుంటాయి, అక్కడ కూర్చున్నంత సేపూ!

కాని చంద్రానికి ఆ రోజు ఈ ఆనందమేమీ కలగలేదు! కెరటాల కదలిక తన హృదయాన్ని కదిలించలేదు. సముద్రపు హోరు తనకేమీ

ఆహ్లాదకరంగాలేదు. ఎందువల్లో దిగాలుపడి కూర్చుండిపోయాడు. ఎంత సేపో అలా కాలం గడిచిపోతూంది!

సంధ్యపోయి... చీకటి ప్రారంభించింది.

సరిగ్గా అదే సమయానికి... అక్కడికి చాలా దూరంలో వున్న ఒక పల్లెటూరిలో...

సీతాపతి... పిచ్చివాడిలా పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళుతున్నాడు. దారిలో ఒకరిద్దరు పలకరించినా వినిపించుకోలేదు! ముఖంలో తీవ్రమైన కోపం కనబడుతూంది! అతని వాలకంచూసి వాళ్ళు ఆశ్చర్య పోయారు! సూటిగావెళ్ళి ఒక ఇంట్లో జొరబడ్డాడు.

ఆ ఇంట్లో వాళ్ళు అతడి తీరుచూసి విస్తుపోయారు! "ఏం ఇలా వచ్చావు, సీతాపతీ!" అని అడిగారు కాని ఇతడేం వినిపించుకోలేదు.

"శేషు ఏడీ?" అని గర్జించాడు.

ఆ అరుపుకి అదిరిపడ్డారు ఆ ఇంట్లో వాళ్ళు.

"ఇంట్లో లేడు. ఏమిటి సంగతి?" అని అడిగారు ఆదుర్దాగా.

"ఎక్కడకు వెళ్ళాడు?" తిరిగి ప్రశ్న.

"ఏదో పనుండి పట్నం వెళతానన్నాడు. ఇంకా రాలేదు. ఈ బండిలో వస్తాడేమో?"

"సరే!" అని వెనక్కి తిరిగాడు. "వాడితో ఏంపని!" అని వాళ్ళు అడుగుతున్నా వినిపించుకోలేదు... మళ్ళీ పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఈసారి... పెద్దరోడ్డు వైపు బయలుదేరాడు. చెట్ల తోపుల్లోంచి... తాటి పెండెల మధ్యనుంచి గోర్జి చేరాడు. అక్కడనుండి పెద్దరోడ్డు ఎక్కాడు. పక్కన పొలాల్లోంచి కప్పలు, చెట్లలోంచి కీచురాళ్ళు రొద ప్రారంభించాయి అప్పటికప్పుడే...

వేటినీ పట్టించుకోకుండా నడిచిపోతున్నాడు సీతాపతి!

* * * *

ఇంకా పూర్తిగా చీకటి పడలేదేమో మసక మసకగా ఉంది.

ఆరోహణ, అవరోహణ చేస్తున్న కెరటాలవంక చూస్తూ ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాడు... చంద్రం!... ఒక్కసారి అంతకుముందు వినబడనంత ఎక్కువగా హోరు వినిపించి తుళ్ళిపడి అటు చూశాడు. ఒక బ్రహ్మాండమైన కెరటం వేయితలల శేషువులా అరఫర్లాంగుమేర వ్యాపించి పడగ ఎత్తుకొని వస్తూంది! అంతపెద్ద కెరటాన్ని తను చూసి ఎరగడు. ఏదో ఆశ్చర్యం, ఆనందం, భయంకూడా వేసింది! కొద్దిమీటర్ల దూరంలో కూర్చున్న తనమీదగాని విరుచుకపడుతుందేమో? అని అనిపించి అప్ర యత్నంగా వెనక్కు జరిగాడు... పెద్దశబ్దంతో ఒక్కసారి బద్దలయి పడిపోయింది కెరటం! జల్లుమని ... ప్రవాహం ... చంద్రం పాదాలని తడిపి వెనక్కు వెళ్ళిపోయింది! లైట్‌హౌస్ ఫోకస్ రంగుల రాట్నంలా తిరుగుతూంది!

త్రాచు పాము మీద మచ్చల్లా నీళ్ళన్ని పరుచుకొని వెనక్కి వెళ్ళి పోతూంటే, ఇసుక నేల ఇట్టే ఆరిపోతూంది! కన్నాలలోంచి పీతలు వస్తు న్నాయి... వాటితోసహా...ఏదోవస్తువు కొట్టుకునివచ్చినట్టు...మెరుస్తూ కనబడింది... ఆ మసకచీకట్లో... ఏమిటా? అని ఆత్రతతో దగ్గిరికివెళ్ళి చూశాడు!

చూసినవాడు అట్లాగే ఉండిపోయాడు ఆశ్చర్యంతో! అవి ... అవి... మంగళసూత్రాలు!... వంగుని తీయబోయాడు. ఇంతలో మరో పెద్ద కెరటం రావడం, చంద్రాన్ని తోసేయడం, ఒళ్ళంతా, ముఖమంతా నీళ్ళవడం... జరిగిపోయింది ... చంద్రం చేతికి పిడికెడు మన్నుతప్ప మరేం అందలేదు!

నీటితో తడిసి ముద్దయినాడు. అలా నిశ్చేష్టుడై కెరటం వెళ్ళాక తేరుకుని... అక్కడంతా కలియజూశాడు. కాని ఎక్కడా ఆ మంగళ సూత్రాలు కనబడలేదు.

మళ్ళీ ఆ ప్రాంతం అంతా జాగ్రత్తగా చూశాడు. ఎక్కడా ఏమీ కనబడలేదు. కెరటాల ఎత్తుపల్లాలు, ఏదో ఎలుగెత్తి చెబుతున్నట్టున్న హోరు తప్పితే మరేంలేదు... చుట్టూ గట్టుపొడుగునా ... బండరాళ్ళతో

పెనుగులాడుతూన్న కెరటాలు, ఇసుక దిబ్బలు, తనలాగే వచ్చిన జనం తప్పితే... ఆ మసక చీకట్లో మరేం కనబడలేదు.

ఒళ్ళంతా తడియడంవల్ల, ఉప్పుగాలి తగులుతూండడంవల్ల చికాకనిపించి, తిరుగుముఖం పట్టాడు... చంద్రం తన లాడ్జివైపు.

* * * *

దూరంనుండి శేషు తాపీగా వస్తూన్నట్టు ... గుర్తుపట్టాడు సీతాపతి... నడక మరింత రెట్టించాడు ... ఏదో ఆలోచనలో ఉన్న శేషు ఆ మసక కాంతిలో ఒక్కసారి ఎదురుపడ్డ సీతాపతిని చూసి గతుక్కుమన్నాడు... పై ప్రాణం పైనే పోయినంత పని అయింది.

"ఎప్పుడొచ్చావు?" అని గర్జించాడు సీతాపతి. ఆ ధోరణి చూసి బెదిరిపోయాడు శేషు. ముచ్చెమటలుపోసి ఒణికిపోయాడు భయంతో ... అయినా తమాయించుకున్నాడు ... వినీ విననట్టు తప్పించుకుని వెళ్ళబోయాడు.

"చెప్పవేం? ఇప్పుడేనా వస్తున్నావు?" అని మళ్ళీ గద్దించి దారికడ్డంగా నిలబడ్డాడు.

"ఆ... ఆ... ఇప్పుడే... ఎప్పుడు రాడం ఏమిటి?" అని తడబడుతూ అన్నాడు.

"చెబుతావా చెప్పవా?" అని చొక్కా కాలరు పట్టుకున్నాడు. దానితో శేషుకి నవనాడులూ కుంగిపోయినా ధైర్యంతోనే, "ఏమిటి చెప్పేది? వదులు!" అని అన్నాడు.

"నిర్మల ఏదీ? ఏం చేశావు?" అని ఆవేశంగా అడిగాడు.

"నిర్మలా... నాకేం తెలుసు?" అని అన్నాడు ఆశ్చర్యం ప్రకటిస్తూ. కాని లోలోపల ఏదో దాస్తున్నట్టు అతని వాలకం చెబుతూనే ఉంది!

"చెప్పకపోయావా నీ ప్రాణం తీస్తాను, జాగ్రత్త! చెప్పు ... ఏం జరిగిందో?" అని సీతాపతి కత్తితీసి చూపెడుతూ, ఆ రోడ్డుమీద

నించి ప్రక్క తోటలోకి ఈడ్చుకుపోయాడు. శేషు భయంతో చూస్తూ పెనుగులాడుతూ వెళ్ళడం తప్పితే బలం చాలిందికాదు వదిలించుకుందికి.

"నాకు తెలీదు... నన్నొదులు... నేను పొలం పనిమీద నుండి వస్తున్నాను! నాకేమీ తెలీదు!" అని ఏడుస్తూ కాళ్ళు పట్టుకున్నాడు.

"పొలంమీదనించి వస్తున్నావా? ఇటేనా పొలం ఉన్నది? అబద్ధం ఆడకు! రైలుస్టేషన్ నుంచి వస్తున్నావు. ఇప్పుడు విశాఖపట్నం నుంచి వచ్చే బండివుంది... అవునా?" అని వాడిని లేవనెత్తి ... కత్తి గుండె మీద పెట్టి చిన్నగంటు పెట్టాడు ... రక్తం ఒంట్లోంచి చొక్కామీద చిమ్మింది. రక్తం చూసి శేషు పెద్దగా ఏడవబోయినాడు.

"పీక నొక్కి చంపేస్తాను! గట్టిగా అరవకు!— జరిగిందేదో చెప్పు... లేదా ఈ కత్తి ఇలాగే గుండెల్లో దిగిపోతుంది!''

"వద్దు...వద్దు... చంపకు ... చెప్పేస్తా..." అని బెక్కుతూ బెక్కుతూ... మధ్య మధ్య భయంతో వణికిపోతూ ... ఏడుస్తూ... చేసిందంతా చెప్పేశాడు.

శేషు ఆఖరిమాట పూర్తిచేయకుండానే సీతాపతిలో చైతన్యం నశించింది! అపాదమస్తకం కోపంతో కదిలిపోయింది. రక్తం ఉడికిపోతూ వుంటే, ఆ ఉద్రేకంలో...గుండెల్లో పొడిచేశాడు!

'అమ్మో!' అని ఒక్క పొలికేక పెట్టి శేషు పడిపోయాడు. ఆ కేక విని రోడ్డుమీద వాళ్ళు నలుగు రయిదుగురు అటు వచ్చి చూశారు.

ప్రాణాన్ని వదిలేస్తూ రక్తంమడుగులో గిలగిలా కొట్టుకుంటున్న శేషుని చూసేసరికి సీతాపతి మతి కూడా పోయింది. వెర్రెత్తినట్లు పరుగెట్టాడు! అదొక్కటే అంత అయోమయంలోనూ అతనికి తోచినది!... చేతిలో కత్తి, చేతినిండా రక్తం ఆ నలుగురయిదుగురూ చూశారు!

"ఏమిటిది, సీతాపతీ!"

"ఆగు! ఎక్కడికిపోతావ్?"

"పట్టుకోండి! పట్టుకోండి!"

అరుస్తున్నారు వెనకనుండి. అవేమీ సీతాపతికి వినబడలేదు... పరుగు! పరుగు! స్టేషన్ వచ్చేవరకూ ఒకటే పరుగు. దూరంలో స్టేషన్ చూసి ఒక్కసారి వెనక్కు చూసి ఆగాడు! అప్పుడు తను అలా కత్తి పట్టుకు పరుగెట్టడం జ్ఞాపకం వచ్చింది!...భయంతో పై మీద తువ్వాలు తీసి దానికి చుట్టబెట్టి, చేతులు తుడుచుకుని మొలలో కనబడకండా దాచేశాడు. ఒక్కటే ఆలోచన...విశాఖపట్టణం వెళ్ళాలి. కనీసం నిర్మల శవమయినా చూడవచ్చు...అనుకుంటూ స్టేషన్‌లోకి వెళ్ళాడు.

వాల్తేరు వెళ్ళే బండి రాత్రి రెండుగంటలకిగాని లేదని చెప్పారు... ఆ రాత్రి...దెయ్యాలు దేవుళ్ళాడుతూన్న ఆ పరిసరాల్లో తనూ ఒక దయ్యమయి ఎవరికీ కనబడకండా ఎక్కడెక్కడో గడిపి...బండి ఎక్కాడు.

* * * *

ఆ రాత్రి అంతా...చంద్రానికి...కెరటాలు...మంగళసూత్రాలు ఇవే కళ్ళలో కనబడుతున్నాయి. ఆ అభాగ్యురాలు ఎవతో? ఆత్మహత్యే చేసుకుందో? చేయబడిందో?...ఆ మంగళ సూత్రాల వెనక ఎటువంటి చరిత్ర ఉన్నదో? లేక అజాగ్రత వల్ల జారిపడినవో?...కాదు...అట్లా జరగదు. తప్పకండా ఏ స్త్రీయో, ఏ పరిస్థితుల్లోనో బలిఅయిపోయి వుంటుంది...అనే ఆలోచనలు. సముద్రపు హోరు చెవుల్లో రింగుమం టూనే వుంది. ఎప్పుడో మగతగా కన్ను మూసిన చంద్రం పేపర్‌బోయ్ పిలుపుతో అదిరిపడి లేచాడు.

బాగా పొద్దెక్కిపోయింది. సూర్యకిరణాలు కిటికీ ఊచల మధ్య నించి రాళ్ళు గీసినట్టు పడుతున్నాయి. అవతల ఎవరో కుక్కను కొట్టి నట్టున్నారు కుంయ్ కుంయ్ మని అరుస్తూంది. ప్రక్కఇంటి కప్పుమీద నుంచి మూతి గీసుకుంటూ, తోక ఎత్తుకుని దొంగతనంగా పాలు తాగేసి దర్జాగా వెళ్ళిపోతూంది మచ్చల పిల్లి.

పేపరు తీసుకుని టేబుల్‌మీద పడేసి బాత్‌రూంలోకి వెళ్ళాడు.

లేచిన దగ్గిరనించి ఏదో జబ్బులో వున్నట్టనిపించింది. సముద్రపు హోరు...ఏమిటో ఈనాడు...ఆ హోరు అతనిని వెంటాడుతున్నట్టు అనిపించింది. దగ్గిరలోనే వున్న సముద్రపు హోరు రోజూ వింటున్నా ఇలా భయపెట్టలేదు ఎన్నడూ!

బయట కిటికీలోంచి బంగారంలా మెరిసిపోతున్న ఉదయకాంతిలో ప్రకృతి తళతళ లాడుతూంది. ఎంతో హుషారుగా, కలకలలాడుతూ కనిపించింది చుట్టూ ప్రపంచం. తనకే ఆ వేళ అలా వున్నట్టుంది.

పేపరు తీశాడు.

"విమాన ప్రమాదంలో 60 మంది దుర్మరణం!" చదవగానే పేజీ మార్చేశాడు.

"వియత్నాంలో భీకర పోరాటం. ఫలితంగా వియత్నాంగుల సర్వనాశనం." మామూలే అనుకున్నాడు!

మరో పేజీ చికాకుగా తిప్పాడు.

ఏదో పురుగు ఆ పేజీలమధ్య చచ్చిపోయి అంటుకుని వుంది. బహుశా ప్రెస్‌లోనే ప్రెస్ అయిపోయి వుంటుంది.

"బీహార్‌లో క్షామం...వందలకొద్దీ ఆకలి చావులు."

"భాషాసమస్య." సంపాదకీయం.

"ఇండియా అటంబాంబు పరీక్ష జరుపుతుంది!" పాకిస్తాన్ ఆరోపణ.

"ఇరవై ఎనిమిదేళ్ళ యువకుడికి...ఉద్యోగం చేస్తున్న వధువు కావలెను" ప్రకటన చదివి, "దేనికి?" అన్న ప్రశ్న అకస్మాత్తుగా కలిగి, "పోషించడానికి కాబోలు" అని అనుకున్నాడు. ఈ రోజుల్లో ఆశ్చర్యం లేదు...నవ్వుకున్నాడు.

రానురాను పత్రికల్లో చదవవలిసింది పోయింది! ఏదో ఒకటి... పేజీలు నింపితే చాలు...అంతకన్నా చదవవలిసింది కనబడక మరో పేజీ తిప్పాడు.

"పోలిక తెలియని స్త్రీ శవం...సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల అనుమానం" అని వ్రాసిన దానికింద ఒక ఫోటో కూడా వేసి వుంది.

చంద్రం కళ్ళు మూసుకున్నాడు.

"అబ్బబ్బ! ఏం పేపరు! అన్నీ ఇలాటి విషయాలే!" అని తిట్టుకుంటూ పేపరు అవతల గిరాటు వెయ్యబోయినాడు కాని...కాని...ఆ స్త్రీ ఫోటో అతని దృష్టిలోంచి తప్పుకోలేదు.

మరోసారి ఆ ఫోటో దీక్షగా చూశాడు...ఆ అభాగ్యురాలెవరో అని!...ఒక్కసారి తను నిన్న సాయంత్రం సముద్రం దగ్గిర చూసిన మంగళసూత్రాలు కళ్ళముందు కదిలాయి! తన అనుమానం నిజమా? వాటికీ, ఈమెకీ సంబంధం వున్నదా? తెలుసుకోవాలన్న ఆతృతతో...ఆ ఫోటోకింద వ్రాసింది చదివాడు, అంత ఆత్మహత్య చేసుకోవలిసిన అవసరం ఏం వచ్చిందా అని.

ఆ ఫోటో దీక్షగా చూస్తున్నకొద్దీ, అతని గుండెలు జోరుగా కొట్టుకోజొచ్చాయి...పరిశీలించి, జాగ్రత్తగా చూసేసరికి తన కళ్ళను తానే నమ్మలేకపోయినాడు.

ఆ ఫోటో ఎవరిదో పోల్చుకున్నాడు...అలా తలుచుకునేసరికి కాళ్ళూ, చేతులూ ఆడలేదు. సందేహం లేదు! ఆ ఫోటోలో...వ్యక్తి...

"అయ్యో" అంటూ కూలబడిపోయాడు! పోలీస్ స్టేషన్‌కు వెళ్ళడమా? మానడమా...? ఏమాలోచించుకున్నాడో తల పట్టుకుని ఆలోచించడం మొదలెట్టాడు.

'ఛీ...ఎంత అసహ్యమయిన చావు? ఎంత అవమానం?' అని విరక్తితో గొణుక్కున్నాడు.

సముద్రపు హోరు భరించలేని విసుగు పుట్టిస్తూంది.

'ఏది ఏమయినాసరే వెళ్ళకూడదు. ఏమీ తెలియనట్టే ఊరుకోవాలి' అని అనుకున్నాడు. విముఖత, కోపం అతనిలో కలిగాయి. కాని...గత చరిత్ర అంతా...జ్ఞాపకానికి రాక తప్పలేదు.

పదేళ్ళ కిందటి మాట!...

ఎప్పుడో చిన్నప్పుడు చదువుకున్న క్లాసుమేటు శేషు. ఆ పెళ్ళి పందిరిలో ఆ ఊళ్ళో అక్కడ, అలా కలుస్తాడని తను అనుకోలేదు!... వాడిని చూడగానే ఒక్క ఊపుని లేచి పలకరిద్దామా అని అనుకున్నాడు. కాని తను పెళ్ళి పీటలమీద వున్నాడు అంచేత వాడే వచ్చి పలకరించాడు. చిన్ననాటి స్నేహం అట్లాంటిది. పీటలమీద కూర్చునే కుశల ప్రశ్నలన్నీ వేసుకున్నారు. అతని స్వంత ఊరు అదేనని, చదువు మానేసిన తరవాత స్వంత పొలాలు చూసుకుంటూ, సాగుచేసుకుంటూ అతను అక్కడే వుండిపోయాడని చెప్పాడు. అంతకన్నా ఆశ్చర్యం ఏమిటంటే, పెళ్ళి కూతురి వైపు నుండి అతను బంధువువట కూడాను!

ఇకనేం, ఆ మూడు రోజులూ ప్రత్యేకంగా గడిపే బాధ తప్పింది. సరదాగా శేషుతో గడపవచ్చు అనుకున్నాడు. పెళ్ళి జరుగుతున్నప్పుడు తప్ప...మిగతా సమయాల్లో అతడితోనే గడిపాడు. రెండు రోజులూ అట్లా సరదాగా...గడిచిపోయింది.

ఆ మూడో రోజు...

తన జీవితానికే ఎసరు పెట్టిన రోజు.

సంతోషం అంతా పటాపంచలయింది.

ఇంకా సంసారజీవితంలో అడుగు పెట్టనేలేదు. పిడుగు పడినట్టయింది!

ఇంకొక రెవరయినా అయితే......ఆ సమయంలో...అలాటి రహస్యాలు బయటపడకుండా చూసి కార్యం జరగడానికి చూస్తారు... కానీ...శేషు!...ఒక ఘోరమయిన రహస్యం...ఎవరితోనయితే చెప్ప కూడదో వారితోనే చెప్పాడు!

ఎందువల్ల? చూస్తూ చూస్తూ తన స్నేహితుడికి అన్యాయం జరిగిపోతున్నదనా? ఏమో? కాని ఆ విషయం పుస్తెముడి కట్టకముందు చెప్పి ఉంటే బావుండేది...ఆ కాస అయిపోయాక చెప్పడం ఎందుకు? ఇద్దరి జీవితాలూ నరకప్రాయం చేయడానికా?...కాదు...స్నేహితుడు కాబట్టే

కళ్ళు తెరిపించాడు. లేకపోతే, జీవితాంతం తను మోసపోయి...ఆ ఎంగిలి జీవితం గడిపి వుండేవాడు...కాని ఇప్పుడాలోచిస్తే ఈ అనుభవిస్తున్న చిత్రవధకన్నా చెప్పుఉండకపోయినా బావుండేదేమో!జీవితం ప్రశాంతంగా గడిచిపోయేది!

తను కళ్ళారా చూశాడు...ఆ సంఘటన. ఆ దృశ్యం ఇంకా ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టుంది.

పెళ్ళి మూడోరోజుని తను, శేషు వరండాలో ఏదో మాట్లాడు కుంటున్నారు.

అవతల పెరట్లో పెళ్ళికూతురు...నూతి దగ్గిర నీళ్ళు తోడు తూంది! మధుపర్కాలు కట్టుకుని, పసుపూ, పారాణి, కళ్యాణం బొట్టుతో ఎంతో అందంగా ఉంది!...లేతవయసుతో, అతిసిగ్గుతో పెళ్ళి బడలిక వల్ల నలిగిపోయిన శరీరంతో...అప్పుడే పాకుతూన్న కొత్త లతలా ఉన్న ఆమె శరీరం... ఇదంతా చూస్తూ గుటకలు మింగుతూన్నాడు చంద్రం. శేషు అది కనిపెట్టకపోలేదు! నిజానికి చంద్రంకన్న ఎక్కువ దీక్షతో అతనే చూస్తున్నాడు.

మాటిమాటికీ ఏదో చెప్పాలని అనుకోవడం, మళ్ళా ఊరుకోవడం! శేషులో ఈ ఆరాటం కనిపెట్టాడు చంద్రం.

"ఏమిటోయ్, శేషూ, అలా ఉన్నా వీరోజు! సరిగ్గా మాటాడ కుండా ముక్కలు తుంచేస్తున్నావు!" దొరికిపోయేడు శేషు.

"ఆ! ఏం లేదు!...మరి ఒకటడుగుతాను, చెబుతావా?"

"అదేమిటోయ్! అలాగంటావు? నీకు చెప్పక ఇంకెవరికి చెబుతా ననుకున్నావు?"

"మరేంకాదు. పెళ్ళి కూతురు ఎలా ఉందంటావు? నచ్చిందా?"

"ఈ ప్రశ్న...ఇంకో ఏడాదిపోయాక అడుగు!" అని నవ్వుతూ అన్నాడు.

"అదేమిటి?" ఆశ్చర్యపోయాడు శేషు.

"లేకపోతే బలేవాడివే? ఆ ప్రశ్న ఇప్పుడు, అంతా అయాక అడుగుతావు. నచ్చకపోతే మూడుముళ్ళూ వేస్తానా?"

"లేదులే...ఏదీ అసలు, ఏం చెబుదామన్నా, ఏం అడుగుదామన్నా నిన్ను పెళ్ళి కొడుకుగా చూస్తానని అనుకున్నానా?"

"ఏమిటలా గంటున్నావు?"

"అహఁ! మరేంలేదూ, ముందుగా నాకేం తెలుసూ అని. పెళ్ళి కొడుకంటే ఇంకెవరో అనుకున్నాను! తీరా చూస్తే నువ్వు" అన్నాడు.

"పోనీ...ఇప్పుడనుకున్నావుగా ఆమె నా భార్యగా. నీ ఉద్దేశ్యం చెప్పు! ఒక్క ఊరివారు కదా. పైగా బంధువులుకూడాను!"

"నీకా పిల్ల నచ్చాక ఇక మా ఇష్టానిష్టాలతో పనేముందిలే!..." అని అర్థోక్తితో నొక్కి అన్నాడు. అది కనిపెట్టాడు చంద్రం.

"ఏమిటోయ్, నీకిష్టంలేనట్టు మాటాడుతున్నావు! సంగతేమిటో చెప్పు...!" అని అంటూంటే శేషు జవాబు చెప్పడం మాని, "అటు చూడు!" అని అన్నాడు పెళ్ళికూతురివైపు చూపుతూ.

మాటల్లోపడి చంద్రం ఈలోపల ఆ నుయ్యి దగ్గిరికి మరొక వ్యక్తి రావడం, నీళ్ళు పోసుకుంటూండడం గమనించలేదు.

అతను నీళ్ళు పోసుకుంటూ ఉంటే పెళ్ళికూతురు నీళ్ళు తోడుతూంది!...అతను ఏదో అంటూంటే సిగ్గుతో నవ్వుతూంది!

కళ్ళారా చూశాడు చంద్రం! మరి మాట రాలేదు! అది చాలా స్వల్ప విషయమే! అయినా శేషు రేపుతున్న అగ్గి హృదయంలో రగుల్కొంటూండడంవల్ల చంద్రం మనసును నల్లటి మబ్బులు కమ్ముకున్నాయి.

"వాడు ఆ పిల్లకి మేనమామ! వాళ్ళది ఈ పొరుగిల్లే!" చెప్పకుపోతున్నాడు శేషు.

"మొదట్లో అతనికే ఇద్దామనుకున్నారు...కాని వాళ్ళకీ, వాళ్ళకీ ఏవో వచ్చి ఆ పిల్ల తండ్రి పట్టుపట్టి ఈ పెళ్ళి చేస్తున్నాడు... అయినా మేనరికంలో ఉన్న మజాయే అది!... ఎంతకాదన్నా

ఇన్నాళ్ళూ వాళ్ళూ ఒకళ్ళ కొకళ్ళని అనుకున్నారాయె! పైగా ఇళ్ళూ కలిసే వున్నాయి. ఒక దగ్గరే ఉన్న చనువాయె! ఈనాటికి పైదయి పోతుందా?" అని అవకాశంకోసం చూస్తున్నట్టు, కనిపెట్టుకుని అనేశాడు.

మరి వినలేకపోయాడు చంద్రం! ముఖమంతా నల్లగా మాడి పోయింది. హృదయం మండిపోతూంది!—శరీరం వణికిపోతూంది! ఒక్కసారి గట్టిగా అరుద్దామనుకున్నాడు. కాని, చదువూ సంస్కారం, పెరిగిన నాగరికత అడ్డు వచ్చాయి. అక్కడినుండి ముఖం తిప్పుకుని వెళ్ళిపోయాడు.

ఆ తరువాత తనకు వినాలని లేకపోయినా మరి శేషు వదలలేదు. శేషుతో మాటాడాలని లేకపోయినా వినక తప్పలేదు! నలుగురిముందూ అయితే తను సహించలేకపోవచ్చు. ఏదయినా గొడవ జరగవచ్చు... అని ఆ పల్లెటూళ్ళో తాటితోపుల దగ్గిర, ఏటి దిబ్బలమీద కూర్చుని శేషు చెప్పేడు మాటల్ని విన్నాడు.

ఏమిటేమిటో చెప్పాడు. తనకు తల తీసేసినంత పని అయింది. "ఇప్పుడు చెప్పేకన్నా, చెప్పకుండా ఉండవలసింది, శేషూ!" అన్నాడు నిట్టూర్చి, నిస్పృహతో, వైరాగ్యంతో.

"నువ్వే పెళ్ళికొడుకువని తెలిస్తే ముందుగా, నీ దగ్గిరకే వచ్చి చెబుదును, బ్రదర్! వచ్చిన దగ్గరనుండి వెంటనే చెబుదామంటే వీలేదీ? అదీగాక నాలో ఎంత ఆత్రత ఉన్నా, వెయ్యి అబద్దాలాడి పెళ్ళి చేయ మన్నారు! అలాంటిది ఒక్క నిజం చెప్పి జరుగుతున్న పెళ్ళిని ఆపి వేయడం ఎందుకని నాలో నేను ఎంతో ఆలోచించుకుని, నోరు మూసు కుని ఊరుకున్నాను. కాని...ఆఖరికి నీ అంతట నువ్వే ఆ దృశ్యం చూసి అడిగేటప్పటికి మరి దాచుకోలేకపోయాను!" అని తను స్వయంగా ఏమీ చెప్పనట్టు నెపం చంద్రంమీదే పెట్టి అన్నాడు.

"అయితే ఏం చెయ్యమంటావు, శేషూ?" అని జాలిగా ఏం చేయ డానికి తోచక అడిగాడు.

"ఇంత మాత్రంలో ఏంపోయింది? చూసీ చూడనట్టు, తెలిసీ తెలియనట్టు సరిపెట్టుకుంటే పోయింది!" అని పెద్ద బరువు దింపుకుని హాయిగా అన్నట్టు అంత సుళువుగా అనేశాడు చంద్రం ఏమంటాడో అని చెవులు రిక్కించి.

అతడు పెట్టిన ఈ అవమానపు బరువుతో కుంగిపోతూ ఆశ్చర్య పోయాడు చంద్రం.

"ఎంత సుళువుగా చెప్పావు!" అన్నాడు.

"లేదూ...ఇష్టంలేకపోతే కొన్నాళ్ళూరుకుని, ఏదో మిషమీద విడాకులిచ్చేయ్యి!" అని నవ్వుతూ అన్నాడు.

"బావుంది నీ సలహా! ఇవాళ పెళ్ళి, రేపు విడాకులూనా?" అని వింతగా అన్నాడు.

ఆ విధంగా శేషు రాజేసిన నిప్పు చంద్రం గుండెల్లో కణకణలాడి, శరీరంఅంతా జ్వాలలు రేపింది. పెళ్ళినుండి తిరిగి వెళ్ళినవాడల్లా మరి ఆ ఊరివైపు రాలేదు. అత్తవారి గుమ్మం ఎక్కలేదు. భార్యని తీసుకు వెళ్ళ లేదు. శేషు చెప్పినట్టు విడాకులూ ఇవ్వలేకపోయినాడు. ఏ సంబంధమూ పెట్టుకోకుండా ఉండడమే ఆమెకు శిక్ష అనుకున్నాడు.

మొదట పెళ్ళికూతుర్ని చూసినప్పుడు... ఎట్లా తలపోశాడు! తన జన్మ తరించిందనుకున్నాడు. ఎంత అందమైన పిల్ల! తనకు అన్నివిధాలా తగిన భాగస్వామిని అని భావించాడు. అట్లాంటి భార్య లభించినందుకు ఎన్నో విధాల భగవంతుడికి నమస్కారాలర్పించాడు. తన జీవితం మూడు పూలు ఆరు కాయలుగా ఆనందంగా ఉంటుందనుకొన్నది ఇలా పరిణమించింది.

ఇట్లా ఆలోచనల్లో వేగిపోతున్నాడు చంద్రం.

* * * *

స్టేషన్లో బండి దిగగానే సీతాపతి గబగబా శేషు చెప్పినచోట్లన్నీ వెతికాడు...కాని...నిర్మల...ఎక్కడా కనబడలేదు. ఒకరిద్దర్ని అడిగి

కూడా చూశాడు. వాళ్ళు ఏమో తెలియదనేసరికి ఊళ్ళోకి బయలు దేరాడు.

* * * *

తను కళ్ళారా చూశాడు. ఆమె ప్రవర్తన చెవులు చిల్లులు పడేట్లు విన్నాడు! ఆమె చేసిన ద్రోహం మరవలేదు. ఇంకా ఆమెకు, తనకుఏమి సంబంధం? పెళ్ళి అవగానే సరా?... ఎందుకు ఆమెను గురించి ఈ ఆవేదన?...ఆమె ఏమయిపోతేనేం? తాను చెయ్యగలిగిందేమీ లేదు... అయినా ఇంతపని జరుగుతుందని కలలోకూడా తలంచలేదు. ఇట్లా ఆలోచనల్లో ఉన్న చంద్రం వీధిలో పెద్ద గోల వినబడే సరికి ఈ లోకంలో పడ్డాడు. ఆ క్షణంలో...ఏమిటో తనింట్లో తన భార్యపోయినట్టూ, అంవరూ ఏడుస్తున్నట్టూ అనిపించి గతుక్కుమన్నాడు. కాని, ఆ ఏడుపులూ, మొరలూ పక్కింటిలో...ఆ ఇంటావిడికి నెలరోజులనుండి బాగు లేదు. బతకదని డాక్టరు చెప్పాడట!...అందరూ ఆ ఆఖరి క్షణం కోసం ఎదురుచూస్తున్నారు. ఇవాళ గాలిలో కలిసిపోయి ఉంటుంది.

చంద్రానికి గుండెల్లో భయం పట్టుకుంది. తల పట్టుకు అట్లాఉండి పోయాడు. ఎంత ధైర్యంగా ఉందామనుకున్నా...ఆ ఫోటో చూసిన దగ్గిర నుండి హృదయంలో తీరని బాధ ఉంటూనే ఉంది. మరిచిపోదామని ప్రయత్నిద్దామన్నా, ఆ ఏడుపుల వాతావరణంలోమరింతఎక్కువవుతూందేకాని ఉపశమించలేదు!

అంతలోనే అకస్మాత్తుగా...తలుపు తోసుకుని ఒక వ్యక్తి ప్రవేశించాడు గాభరాగా, భయంతో వణికిపోతూ. వస్తూనే ఒక కాగితం... అక్కడ టేబుల్ మీద పడేస్తూ బావురుమని ఏడుస్తూ కూలబడి పోయాడు.

ఆ వచ్చిన వ్యక్తిని నిశ్చేష్టుడయి చూశాడు...చంద్రం. "మీరా!" అనిమాత్రం అనగలిగి, ఆ కాగితం తీసి చూశాడు. అదొక ఉత్తరం... ఏమీ అర్థంకాక వణుకుతున్న చేతులతో చదవడం ప్రారంభించాడు.

అవతల వ్యక్తి కూర్చోలేక లేచి అటూఇటూ పచార్లుచేయడం మొదలెట్టాడు. అతనిలో కోపమే ఉందో, నిరాశే ఉందో చెప్పలేంకాని, చప్పున పొంగి చల్లారిపోయిన ఉద్రేకం, చెప్పరాని భయంమాత్రం కనబడుతూన్నాయి! మాటిమాటికి అతను గుమ్మంలోంచి, కిటికీలోంచి వీధిలోకి బెదురుతూ చూస్తున్నాడు.

"నాన్నగారూ, ఇలా ఉత్తరం వ్రాసిపెట్టి...మీతో చెప్పకుండా వెళ్ళిపోతున్నందుకు క్షమించండి. ఇన్నాళ్ళూ నా బ్రతుకు ఎందుకిలాగ యిందో కూడా తెలియకుండా గడిపాను. కారణం తెలిశాక మరి ఇక్కడ ఉండలేకపోతున్నాను...మీతో చెప్పినా మీరు వెళ్ళనివ్వరని తెలుసు... ఏనాడు పెళ్ళిలో ఆయన ముఖం చూశానో అంతే? మళ్ళీ నేటివరకూ దర్శనం లేదు...నన్ను తీసుకువెళ్ళకపోడానికి కారణమూ చెప్పలేదు. ఆయన నిర్లక్ష్యానికి మీరూ కోపం తెచ్చుకొని, అడగనన్నా లేదు! పోనీ, నన్ను నా అదృష్టానికి వదిలేసి ఆయన దగ్గిరికి పంపే ప్రయత్నమయినా చేయలేదు! నేను ఎవర్నని అడిగేది? ఏం చేసేది? మీ పట్టుదలలూ, మీ పంతాలూ మీరు నెగ్గించుకుంటూ వచ్చారేగాని నా సంగతి ఆలోచించలేదు. మీ ఇద్దరి మొండితనానికి నేను బలిఅయిపోయాను. నాలో నేను చెప్పలేక, తెగించి ఎవరినీ అడగలేక ఎంత సతమతమయ్యేదాన్నో భగవంతుడే సాక్షి...కారణం ఎవరూ చెప్పరు! అసలు ఎవరికీ తెలియదేమో!

కాని మొన్న తెలిసింది. నే చేయని పాపానికి, నే నెరగని నేరానికి నాకెందుకీ శిక్షో ఆ భగవంతుడినే అడగాలి. ఆ శేషు లేడూ...వాడే నా బ్రతుకిలా పాడవడానికి కారణం.

మీతో ఎన్నడూ చెప్పలేదుకాని...శేషు నన్నెప్పుడూ వెంటాడే వాడు. నన్ను ప్రేమిస్తున్నాననేవాడు. పెళ్ళి చేసుకుంటానని, అంచేత తన కోర్కె తీర్చమనికూడా అడిగాడు. కాని నేను ఒప్పుకోలేదు. "మా నాన్ననడిగి ఒప్పించు. పెళ్ళి జరిగాక నా అభ్యంతరం లేదు." అనిచెప్పి తప్పించుకుంటూ వచ్చాను. కాని వాడు వదిలి పెట్టలేదు. నాకు వాడి ప్రవర్తన అసహ్యం వేసి ఒకనాడు 'నా కిష్టంలేదు. మరి నాజోలికి రాకు, నాతో మాటాడకు' అని చెప్పేశాను.

దాంతో ఏమనుకున్నాడో ఏమో! అంత ప్రాధేయ పడినవాడు మరి నా ఊసు ఎత్తలేదు. నాకు ఆశ్చర్యం వేసినా, 'మరి లాభంలేదని ఊరు కున్నాడేమో!' అని అనుకున్నాను.

ఈలోపున ఈ పెళ్ళి జరగడంతో ఇంక ఇక్కడనించి, ఈ శేష గిరినించి దూరంగా పోవచ్చు గదా అని ఎంతోఆనందించాను...కాని... పెళ్ళిలో...ఆయనతో కలిసి శేషు తిరగడం, ఇద్దరూ మాటాడుకోవడం చూసే సరికి నా గుండెల్లో రాయి పడింది. ఇదేదో కొంప ములగడానికే అని మనసులో అనుమానం పట్టుకుంది. ఆ తరువాత వాళ్ళిద్దరూ చిన్న నాటి స్నేహితులని తెలిశాక కొంత నిబ్బరం కలిగినా—నాగుపాము లాంటి శేషు అంత మంచిగా ఊరుకుంటాడంటే నమ్మకం లేక భయం మాత్రం పోలేదు. అనుకున్నట్టే కాటువేశాడు. పెళ్ళినాడు వసంతంలోనే విషం పోశాడు.

వాడు అనుకున్నట్టు జరిగింది. నాకూ, ఆయనకీకాకుండా చేశాడు. తరువాత అవకాశంకోసం వేచిఉండి, మొన్నను మళ్ళీ నన్ను నిలబెట్టి అడిగాడు...నా మీద ఏదో జాలి, సానుభూతి ఉన్నట్టు మాట్లాడాడు ఏమీ ఎరగనట్టు.

'చూశావా? చెబితే విన్నావుకాదు—నన్ను కాదని మరొకడిని పెళ్ళి చేసుకున్నావు! వాడి సంగతి నీకేం తెలుసు? ఉత్తి మోసగాడు! రౌడీ! వాడికి నువ్వే కావాలా? డబ్బుకోసం నిన్ను చేసుకున్నాడు. అంతే! ఇహ నీ జీవితం అడవి కాచిన వెన్నెల కావలసిందే! ఇప్పుడయినా నా మాట విను! అక్కడ వాడేం నీకోసం మడికట్టుకు కూర్చోలేదు.... నీ జీవితం, యౌవనం ఎన్నాళ్ళిలా వృధా చేసుకుంటావు? పోనీ, పెళ్ళిచేసు కోపోతేనేం!...హాయిగా ఇద్దరం ఆనందిద్దాం!—ఎవరికీ తెలియదుగా!' అని చెప్పడం మొదలెట్టాడు. ఇంకా వాడికా పాపపు బుద్ధి పోనందుకు చెడామడా తిట్టి మళ్ళీ నా ఊసు ఎత్తితే మీతో చెబుతానన్నాను...కాని, ఎంతకి తెగించాడో బలవంతం చేయబోయాడు. నేను అల్లరి చేయడానికి ప్రయత్నించేసరికి తన కసి అంతా చెప్పేశాడు.

"నిర్మలా, నన్ను కాదన్నావు. నాకు సుఖంలేకుండా చేశావు కాబట్టి, నువ్వూ అనుభవిస్తావు, నీకు జీవితంలో సుఖం లేకుండా చేయడానికి నేను ముందే జాగ్రత్తపడ్డాను... నీ భర్త నా స్నేహితుడని మరిచిపోకు! నేనేం చెప్పినా నమ్ముతాడు....నీ పెళ్ళిలో నేను చెప్పినవిషయాలు నమ్మడానికి అట్టే సేపు పట్టలేదు. నీ భర్తకి నేను చూసిన నిదర్శనాలు చాలు. ఇహ ఈ జన్మలో నీ మొహం చూడడు...అనుభవించు..." అని అంటూ కోపంతో వెళ్ళిపోయాడు.

ఆ మాటలు విని నేను ఆ పెరట్లోనే మూర్ఛపోయాను. జ్ఞాపకం ఉందా, నాన్నగారూ. ఆ రోజున నాకు ఫిట్సు వచ్చాయని, హిస్టీరియా అనీ అందరు అన్నారు...ఆ ఆలోచనలు వచ్చినప్పుడల్లా నాకు తలతిరిగి పోయేది...అదీ కారణం.

ఇదంతా మీతో చెబితే నమ్ముతారో నమ్మరో! ఇంక భరించలేక పోయాను. అందువల్ల నా దేవుడి దగ్గరికి పోయి ఆయన కాళ్ళమీదే పడి చెప్పుకుందామని నిశ్చయించుకున్నాను. ఆయన ఆదరిస్తే మంచిదే. లేదా ఆ భగవంతుడి దగ్గిరికే పోయి సూటిగా 'ఎందుకిలా చేశావ'ని అడుగుదామనుకున్నాను—నా నిర్ణయానికి క్షమించండి...నాకోసంచూడకండి. ఉంటే ఆయన దగ్గిరో, లేకపోతే భగవంతుడి దగ్గిరో ఉంటాను... అంతే. ఆ రెండే నాకు మిగిలినచోట్లు...సెలవు...

ఇట్లు,

నిర్భాగ్యురాలు,

—నిర్మాల."

ఈ ఉత్తరం చదివి చంద్రం ఒక్క నిట్టూర్పు విడిచాడు. గుండె ఆగి మళ్ళీ పనిచేస్తున్నట్టు అనిపించింది. ఉత్తరం టేబుల్‌మీద పెట్టి మాట్లాడ్డానికి నోరు రాక, ఆ వచ్చిన వ్యక్తివైపు చూడలేక తల దించుకున్నాడు ఆ వ్యక్తి.

“ఆ తర్వాతేం జరిగిందో తెలుసా...? నిర్మల ఈ పూరురావడం ఎప్పుడు కనిపెట్టాడో ఏమో శేషు వెంటపడ్డాడు...ఈ సంగతులన్నీ ఎక్కడ బైట పెడుతుందో అని వాడి భయం. ఇక్కడికి వచ్చి ఎటు వెళ్ళడమో తెలియక దిక్కులు చూస్తున్న నిర్మలని మంచి మాటలాడి—తను మారిపోయానని, ఆమెకు సాయం ఉండి దిగబెడతానని నమ్మించి—తనతో తీసుకెళ్ళాడు...ఎక్కడి కనుక్కున్నావు?...ఇక్కడే టౌన్‌హాల్ సందులో తన స్నేహితుడొకడు ఒంటరిగా వున్నాడట, వాడి ఇంటికి తీసుకెళ్ళి అక్కడ ఉంచాడు. నిర్మల ఆ మోసం గ్రహించి ఏడుస్తూ, తిడుతూ కూర్చుందిట.

ఆ స్నేహితుడు, శేషు ఏదో ఘర్షణపడుతూన్న సమయంలో వాడికి తెలియకుండా ఆ ఇంట్లోంచి జారుకుంది నిర్మల... ఆ సంగతి గ్రహించి శేషు ఇవతలికి వచ్చేసరికి, అప్పుడే నిర్మల ఆ సందుదాటి పోయింది. ఎటు వెళ్ళిందో అక్కడి వాళ్ళని అడిగి వెంటపడ్డాడు.

సముద్రంవైపు లైట్‌హౌస్ పక్కసందులోంచి...నిర్మల గబగబా వెళ్ళిపోతుండడం చూసి, ఆగమని అరిచాడట ! ఆ కేక విని శేషుని చూసి నిర్మల...మరింత వేగంగా పరిగెడుతూ వెళ్ళి సముద్రంలో—”అని అంటూమరిమాటలు రాకఏడుస్తూ“సముద్రంలోపడిచచ్చిపోయిందినిర్మల” అని బెక్కుతూ వెక్కివెక్కి కుమిలి పోయాడు. మళ్ళీ తేరుకుని“శేషు ఈ సంగతి చెబుతూంటే, నే సహించలేక పోయాను...గుండెలమీద ఉంచిన కత్తితో అలాగే పొడిచేశాను. తిన్నగా మరేమీ తోచక ఇక్కడికి వచ్చేశాను...విన్నావా? చెప్పు, చంద్రం...ఇప్పుడు చెప్పు—మా నిర్మల... ఎంత నిర్మలమయిందో...? చూశావా! చెప్పుడు మాటలు విని ఎంతపని చేశావో? నీకూ దక్కలేదు...నాకూ దక్కలేదు...నిర్మల బలి అయిపోయింది. ఎక్కడా చోటు లేక...నా తల్లి ఆఖరికి సముద్రపు ఒడిలో తల దాచుకుంది! అయ్యయ్యో...” అని చెబుతూ కిటికీలోంచి వీధితలుపు చూస్తున్నవాడల్లా గబగబా వచ్చి, “చంద్రం...చంద్రం...ఎవరో ఖాకీ బట్టలతో వస్తున్నాడు...మనఇంటివైపే వెళ్ళు...ఎవరూ లేరని చెప్పు...

వెళ్ళు...నేను బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోతా... వెళ్ళు చంద్రం..." అని భయంతో బాత్‌రూంలోకి పరిగెత్తి తలుపులు వేసుకున్నాడు.

గుమ్మంవైపు చూస్తే పోస్టుమాన్ "పోస్టు!" అని అంటూ ఉత్తరం ఇచ్చి పోయాడు.

చంద్రం చల్లబడిపోయి "వాడు పోస్టుమన్. రండి, భయంలేదు. అయిందేదో అయింది" అని అన్నాడు.

"పోస్టుమానా ! అమ్మయ్య! కాకీడ్రస్ చూసి పోలీసేమో అనుకున్నాను. బ్రతికించాడు భగవాన్ !" అని అంటూనే మళ్ళీ వీధివైపు చూస్తూ "చంద్రం, నిజంగానే వచ్చారు !" అని అంటూ కుర్చీలో నిర్జీవంగా పడిపోయాడు. వీధిలో ఇద్దరు పోలీసులు ఎవడినో లాకప్‌చేసి తీసుకు వెడుతున్నారు.

చంద్రం అంత విచారంలోనూ నవ్వుకున్నాడు. "ఆయనకిభయం ఎముకలకు పట్టిపోయింది" అనుకున్నాడు.

"లెండి...వాళ్ళు ఎవరో దొంగ వెధవని పట్టుకొని పోతున్నారు" అని కుదుపుతూ పిలిచాడు. కాని అతను కదలలేదు. గుండె వేగంగా కొట్టుకుంటూంది. స్పృహలేదు. గాభరాలో ఇన్ని నీళ్ళు తెచ్చి ముఖంమీద చల్లాడు.

కొంతసేపటికి తెలివి వచ్చింది. బిక్కుబిక్కుమని బెదురుచూపులు చూస్తూ "పంపేశావా...ఎవరూ లేరని చెప్పి?" అని అడిగాడు జాలిగా.

"ఎవర్ని ? ఎవరూ లేందే!" అని అన్నాడు చంద్రం.

"ఎవరూ రాలేదా నాకోసం? మరి ఆ పోలీసులు!"

"వాళ్ళు ఇక్కడి కెందుకొస్తారు?... పక్కనే ఎక్కడో దొంగతనం అయితే పట్టుకొని తీసుకొనిపోతున్నారు. అంతే!"

"అబ్బ! ఎంత భయం వేసింది ! పోనీ..." అని గుండెలమీద చేతులు వేసుకొని, "ముందా తలుపులు వేసిరా...చెబుతాను!" అన్నాడు భయంగా అటూ ఇటూ చూసి.

"ఎందుకు?" అని అడిగాడు అర్థంగాక చంద్రం.

"ముందు వేసిరా చెబుతాను" అని అన్నాడు పెదిమలతోనే శబ్దం బయటికి రాకండా.

చంద్రం తలుపులు వేసి వచ్చాడు.

అతడు చొక్కా ఎత్తి మొలలోనుండి తువ్వాలులో చుట్టిపెట్టిన మడత తీశాడు. చంద్రం ఆశ్చర్యంగా చూస్తున్నాడు. వణుకుతున్న చేతులతో అందులోని ఒక బాకు తీసి పట్టుకుని "చూడూ, దీని నెలాగయినా కనబడకుండా దాచెయ్యాలి ! ఎవరికీ చెప్పకు. ఈ కత్తి ఉంచు—నే నిక్కడకు వచ్చినట్టు ఎవరికీ తెలియకూడదు. పోలీసులు పట్టుకుంటారు ! అన్నట్టు సముద్రపొడ్డు అంతా గాలించాను. అక్కడ ఎవ్వరూ మాకు తెలీదంటే మాకు తెలీదన్నారు. ఏమయినట్టో..." అని అన్నాడు.

"ఇంకా ఉంచుతారా ! ఇది చూడండి...నా కిప్పుడే చూస్తే తెలిసింది!" అని పేపరు అతని చేతిలో పెట్టాడు.

అది చూసి ఒక్కసారి అతను భోరుమని ఏడవడం మొదలెట్టాడు.

"అయ్యో! చిట్టితల్లీ ...ఎంతపని చేశావు ! నిన్ను కడసారి చూడ నన్నా చూడలేక పోయానే...నాతో చెబితే నే కాదంటానా ? నన్ను నమ్మలేదా తల్లీ ! అయ్యో ! ఇంకెలా బ్రతికేది ?" అంటూ ఆ ఫోటో చూస్తూ గుండెలు కొట్టుకున్నాడు.

ఇదంతా విన్నాక చంద్రం జీవచ్ఛవంలా ఉగయిపోయినాడు. చెప్పుడు మాటలు ఎంత విపరీత పరిణామాలకు దారితీసాయో, స్వార్థం కోసం మనిషెంత నీచపు పనికయినా ఎలా దిగజారి పోతాడో, అలాగే నీతికోసం ఆ మనిషే ప్రాణానికయినా తెగించి ఎంత త్యాగమయినా ఎట్లా చేస్తాడో, పగ ఎంత పని ఆ మనిషిచేతే చేయిస్తుందో...అవన్నీ తలుచుకుంటూ అలాగే వుండిపోయాడు.

ఇంతలో తలుపు చప్పుడయింది. ఇద్దరూ అనుమానంతో అటు వైపు చూశారు. "తలుపు తియ్యండి, తలుపు తియ్యండి" అనే మాటలూ, తలుపు తడుతున్న చప్పుడూ.

చంద్రం వెళ్ళి తలుపు తీశాడు.

పోలీసులు !

ఆ వెనకాలే శేషు తాలూకు మనుషులు ! తీసుకువచ్చారన్నమాట !

వాళ్ళను చూసి అధైర్యాన్నంతా ఒకసారి గుప్పిట పెట్టి గంభీరంగా నిలుచున్నాడు చంద్రం దగ్గరికి వచ్చిన వ్యక్తి. అతనిలో ఏదో మొండిధైర్యం ప్రవేశించింది.

"పదండి !" అంటూ పోలీసుల వెనకాల నడిచి వెళ్ళిపోయాడు సీతాపతి !

అల్లా వెళ్ళిపోతున్న మామగారిని చూస్తూ కంటినీరు పెట్టుకున్నాడు...చంద్రం.

ఆంధ్ర సచిత్ర వార పత్రిక 23-10-68